

జ్వాలావీరభద్రుడికి అభిషేకాలు

శ్రీశైలం: స్వామి అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్రస్వామికి బుధవారం జలాభిషేకం, క్షీరాభిషేకం తదితర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం : భ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్ల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి బుధవారం హైదరాబాద్‌కు చెందిన జితిన్ జయస్వామి రూ.1,00,558 విరాళం అందజేశారు.



జర భద్రం!

కొద్ది రోజుల్లో వర్షాకాలం ప్రారంభమవుతుంది. ఇప్పటికే జిల్లాలో అక్కడక్కడా వానలు కురుస్తుండటంతో దోమలు వ్యాప్తి పెరిగి డెంగీ, మలేరియా జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉంది. వివరాలు 10 లో..

న్యూస్‌రీల్

కురిసింది వాన

- పత్తికొండలో 42.4 మి.మీ. వర్షం



కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాల్లో అకాల వర్షాలు కురిశాయి. మంగళవారం సాయంత్రం నుంచి కర్నూలు జిల్లాలోని ఎనిమిది మండలాల్లో వర్షాలు కురిశాయి. పత్తికొండలో భారీ వాన కురిసింది. పత్తికొండలో 42.4 మి.మీ. వర్షం కురవగా... ఆలూరు, కౌతాళం, ఆస్పరి, కర్నూలు అర్బన్, కల్లూరు, ఆదోని, కర్నూలు రూరల్ మండలాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి. నంద్యాల జిల్లాలోనూ వివిధ మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. ఆత్మకూరులో 17.8 మి.మీ., డోన్‌లో 10.6, పాములపాడులో 8.2, బండిఆత్మకూరులో 6.2, కోవెలకుంట్లలో 4.4, ఆళ్లగడ్డలో 4.0, పాణ్యంలో 3.2, జూపాడుబంగ్లాలో 1.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. కాగా ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. కర్నూలులో 40.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం. మంత్రాలయంలో 39.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నంద్యాల జిల్లాలో గడివేములలో 40.4, కొత్తపల్లిలో 40.1, బనగానపల్లెలో 40 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

పాత నేరస్తుల అరెస్టుపై 'సెబ్' దృష్టి

కర్నూలు : మద్యం, నాటుసారా అక్రమ రవాణాకు పాల్పడిన కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న పాత నేరస్తులపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు దృష్టి సారించారు. మద్యం కేసులు ఉన్న పాత నేరస్తులందరినీ అరెస్టు చేసి జైలుకు పంపాలన్న ఆ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్టేషన్ల వారీగా సెబ్ సిబ్బంది వారి జాబితాను తిరగేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 సెబ్ స్టేషన్లు ఉన్నాయి. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి పన్ను చెల్లించని మద్యం జిల్లాలోకి అక్రమంగా రవాణా చేస్తూ కొంతమంది పట్టుబడ్డారు. అలాగే సారా తయారీదారులు, రవాణాదారులపై కూడా ఉమ్మడి జిల్లాలో పలు కేసులు ఉన్నాయి. సెబ్ స్టేషన్ల వారీగా వారి జాబితాను తయారు చేశారు. 48 మందికి పైగా అక్రమ మద్యం రవాణా కేసులు ఉండగా కొందరిని ఇప్పటికే అరెస్టు చేసి జైలుకు పంపారు. ఉన్నతాధికారుల తాజా ఉత్తర్వుల మేరకు మరికొందరిని అరెస్టు చేసి జైలుకు పంపనున్నారు. ఇందులో మద్యం రింగ్ మాస్టర్ కడప జిల్లాకు చెందిన రింగు బాషా, తంగరడోణ నర్సన్నతో పాటు మరో పది మంది దాకా జాబితాలో ఉన్నారు.

మార్కెట్‌కు తగ్గిన పంట ఉత్పత్తులు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు ఉల్లి రాక తగ్గిపోయింది. ఈ నెల 14న కేవలం 19 క్వింటాళ్లు వచ్చింది. బుధవారం మార్కెట్‌కు ఒక్క క్వింటం కూడా ఉల్లిగడ్డలు రాలేదు. వేరుశనగ, ఎండుమిర్చి, కందులు ఇలా అన్ని పంట ఉత్పత్తులు కూడా మార్కెట్‌కు అతి తక్కువగా వస్తున్నాయి. అన్‌సీజన్ కావడంతో మార్కెట్లో పంటల తాకిడి గణనీయంగా తగ్గింది. కాగా కందులకు ధరలు నిలకడగా ఉంటున్నాయి. కందులు 49 క్వింటాళ్లు రాగా కనిష్ట ధర రూ.4,002, గరిష్ట ధర రూ.11,791 లభించింది. సగటు ధర రూ.11,529 నమోదైంది. సగటు ధరను పరిశీలిస్తే అన్ని లాట్లకు రూ.11,500 వరకు ధర లభించినట్లు తెలుస్తోంది. మినుములకు గరిష్టంగా రూ.9,009, కొర్రలకు రూ.4,789, శనగలకు రూ.6,018, ఆముదాలకు రూ.5,254, వేరుశనగకు రూ.6,520 ప్రకారం ధరలు లభించాయి.

నేడు సీడీసీ డీన్‌లతో సమీక్ష

కర్నూలు కల్చరల్: విజయవాడలోని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీడీసీ) డీన్‌లతో గురువారం యాప్సీ చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు. డిగ్రీ కళాశాలల అఫ్లియేషన్ అంశంపై చర్చించనున్నారు. శుక్రవారం వర్సిటీల అకడమిక్ అఫైర్స్ డీన్‌లు, పరీక్షల విభాగం డీన్‌లు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌లతో సమీక్షిస్తారు. వచ్చే విద్యా సంవత్సరం అకడమిక్ క్యాలెండర్, పరీక్షల నిర్వహణపై చర్చించనున్నారు. రాయలసీమ విశ్వవిద్యాలయం నుంచి సీడీసీ, అకడమిక్ అఫైర్స్, ఎగ్జామినేషన్ల డీన్‌లు పాల్గొననున్నారు.

17న వేలం పాటలు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో ఈనెల 17న వివిధ వ్యాపారాల లైసెన్స్ కోసం వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజగౌడ్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు. 18న స్వామివారి హుండీ ఆదాయం లెక్కించనున్నట్లు తెలిపారు.

తెల్ల బంగారమాయేనా!

ముందస్తు వర్షాలకు పెరగనున్న పత్తి సాగు

- ఖరీఫ్ సాధారణ సాగు 4.20 లక్షల హెక్టార్లు
- అధిక సాంద్రత పద్ధతిపై రైతుల దృష్టి
- ఇప్పటికే బ్లాక్ మార్కెట్‌లో పత్తి విత్తన ప్యాకెట్లు
- 450 గ్రాముల ప్యాకెట్ ఎంఆర్‌పీ రూ.864
- మార్కెట్‌లో రూ.1300 పైబడి ధరతో అమ్మకాలు
- నకిలీల నియంత్రణ మరచిన అధికారులు



అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేసిన పత్తి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో నల్లరేగడి నేలలు ఎక్కువగా ఉండటం వల్ల దశాబ్దాలుగా పత్తి సాగు అధికం. అంతేకాదు.. హైబ్రిడ్ పత్తి, బీటీ పత్తి విత్తనోత్పత్తి ఇక్కడే ఎక్కువగా ఉంటోంది. రాష్ట్రంలోనే అత్యధికంగా పత్తి సాగయ్యేది కూడా కర్నూలు జిల్లాలోనే కావడం విశేషం. ఈ సారి మే నెలలోనే వర్షాలు ఆశాజనకంగా పడుతుండటం, రానున్న రోజుల్లో వర్షాలు విస్తారంగా కురిసే అవకాశం ఉండటంతో రైతులు పత్తి సాగుపై దృష్టి సారిస్తున్నారు. పత్తి సాగులో దాదాపు నష్టం వచ్చే అవకాశం లేకపోవడం వల్ల రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ పరిస్థితిని పత్తి విత్తన డీలర్లు సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లా సాధారణ సాగు 4.20 లక్షల హెక్టార్లు ఉండగా.. పత్తి 2.50 లక్షల హెక్టార్లలో సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ముందస్తుగా బీటీ పత్తి విత్తన ప్యాకెట్లు సిద్ధం చేసుకోవడంపై రైతులు దృష్టి సారించారు. బీటీ-2 పత్తి విత్తన ప్యాకెట్ 450 గ్రాముల ధర రూ.864 మాత్రమే ఉండగా.. డీలర్లు ప్యాకెట్‌ను రూ.1300పైనే విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే బ్లాక్ మార్కెట్ దందా జోరుగా సాగుతున్నా వ్యవసాయ శాఖ కన్నెత్తి చూడటం లేదు. ఇప్పటికే బ్లాక్‌లో కొన్ని వందల ప్యాకెట్లు విక్రయించినట్లు స్పష్టమవుతోంది. ఎంఆర్‌పీతో బిల్లు ఇస్తూ రైతులను దగా చేస్తున్నారు.

హెచ్‌టీ పత్తి విత్తనాల పట్ల అప్రమత్తం

పత్తిలో హెచ్‌టీ విత్తనాలకు కేంద్రం ఇంతవరకు అనుమతి ఇవ్వలేదు. హెచ్‌టీ పత్తి గ్లైపోసేట్ అనే కలుపు మందును తట్టుకుంటుంది. పత్తిలో కలుపు సమస్య ఎక్కువగా ఉంటుంది. హెచ్‌టీ పత్తిలో కలుపు నివారణకు గ్లైపోసేట్ మందును పిచికారీ చేస్తే కలుపు నాశనం అవుతుంది తప్ప.. పత్తి పంటకు ఏమీ కాదు. హెర్బిసైడ్ టాలరెంట్ బీటీ పత్తి విత్తనాలు జీవవైవిధ్యానికి ప్రమాదకరమనే ఉద్దేశంతో కేంద్రం వీటికి అనుమతివ్వలేదు. అయినప్పటికీ కొంతమంది రైతులు హెచ్‌టీ పత్తి సాగు చేస్తున్నారు. ప్రతి ఏటా వ్యవసాయ శాఖ హెచ్‌టీ పత్తి విత్తనాలను సమూలంగా నిర్మూలించేందుకు తనిఖీలు చేపడుతుంది. ఈ సారి కూడా వ్యవసాయ శాఖ కమిషనరేట్ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం పత్తి విత్తన ప్రాసెసింగ్ యూనిట్లలో తనిఖీలు చేపట్టి అక్కడికక్కడే పరీక్షలు నిర్వహించింది. అయితే హెచ్‌టీ పత్తి విత్తనాలు ఉన్నట్లు నిర్ధారణ కాలేదు. అయినప్పటికి ఆ పత్తి విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశిస్తూ జిల్లాకు 526 హెచ్‌టీ కాటన్ స్ట్రిప్ సరఫరా చేసింది. వీటితో అనుమానం వస్తే ఎక్కడికక్కడే పరీక్షలు నిర్వహించవచ్చు. ఆదోని సబ్ డివిజన్‌కు 200 స్ట్రిప్స్, ఎమ్మిగనూరుకు 150, కర్నూలుకు 126, ఆలూరుకు 20, పత్తికొండ సబ్ డివిజన్‌కు 30 ప్రకారం హెచ్‌టీ కాటన్ స్ట్రిప్ సరఫరా చేసినట్లు తెలుస్తోంది.

మార్కెట్‌లోకి నకిలీ విత్తనాలు?

- ప్రతి ఏటా నకిలీ బీటీ పత్తి విత్తనాల బారిన పడి రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు.
- నకిలీ పత్తి విత్తనాలకు ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం, కోడుమూరు, వెల్దుర్తి కేంద్ర బిందువులుగా ఉంటున్నాయి.
- నకిలీ విత్తనాలను బ్రాండెడ్ కంపెనీ విత్తనాల తరహాలో ప్యాకింగ్ చేసి మార్కెట్‌లోకి వదులుతున్నాయి.
- 2023-24లో పత్తిలో నకిలీ విత్తనాలకు సంబంధించి బారీగా కేసులు నమోదయ్యాయి.
- ఈ సారి మొన్నటి వరకు అధికార యంత్రాంగం సార్వత్రిక ఎన్నికల్లో నిమగ్నం కావడం వల్ల నకిలీలపై దృష్టి సారించనట్లు తెలుస్తోంది.
- ఇదే అదనుగా అక్రమార్కులు నకిలీ విత్తనాల ప్యాకింగ్ పూర్తి చేసి మార్కెట్‌లోకి విడుదల చేసినట్లు సమాచారం.

అధిక సాంద్రత పద్ధతితో మెరుగైన దిగుబడి

పత్తిలో అధిక సాంద్రత పద్ధతిపై రైతులు దృష్టి సారిస్తున్నారు. గత ఏడాది ఐసీఏఆర్-సీఐసీఆర్ నాగపూర్, సీసీఐ, నంద్యాల ఆర్ఏఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా కల్లూరు, సీ.బెళగల్ మండలాల్లో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేపట్టారు. గత ఏడాది వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ ఈ పద్ధతిలో 2.50 నుంచి 3 క్వింటాళ్ల వరకు అధిక దిగుబడులు రావడం విశేషం. సాధారణ పద్ధతిలో సాలుకు, సాలుకు మధ్య 90 సెంటీమీటర్లు.. మొక్కకు, మొక్కకు మధ్య 45 సెంటీమీటర్లలో పత్తి విత్తనాలు నాటుతారు. ఇలా నాటడం వల్ల ఎకరాకు 9,876 మొక్కలు వస్తాయి. అధిక సాంద్రత పద్ధతిలో మొక్కల సంఖ్య పెరుగుతుండటం వల్ల దిగుబడి రెట్టింపు కంటే ఎక్కువ స్థాయిలో వస్తుంది. ఈ పద్ధతిలో మొక్కలన్నీ ఒకే సైజులో పెరుగుతాయి. అధిక సాంద్రత పద్ధతికి మార్కెట్‌లో లభిస్తున్న విత్తనాలు సరిపోవు. ఇందుకోసం ప్రత్యేకంగా విత్తనాలు సిద్ధవుతున్నాయి. పత్తికి ప్రధానంగా గులాబిరంగు పురుగు బెడద ఎక్కువగా ఉంటుంది. ఈ పద్ధతి సాగులో గులాబిరంగు పురుగు బెడద కూడా తక్కువ.

గత ఏడాది వర్షాభావ ప్రభావం



నంద్యాల ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు గత ఏడాది లక్ష్మిపురంలో ఒక్కో రైతు చేత ఎకరా భూమిలో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయించారు. గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ఆశించిన దిగుబడులు రాలేదు. అయినప్పటికీ సాధారణ పద్ధతిలో సాగు చేస్తున్న పత్తితో పోలిస్తే దిగుబడి మెరుగ్గానే ఉంది. పెట్టుబడి వ్యయం కూడా తక్కువే. ఈ సారి కూడా అధిక సాంద్రత పద్ధతిలోనే సాగు చేస్తాం. **– సర్వేశ్వరరెడ్డి, లక్ష్మిపురం, కల్లూరు మండలం**

అధిక సాంద్రత పద్ధతిని ప్రోత్సహిస్తాం



ఈ ఏడాది ఖరీఫ్‌లో కూడా పత్తిలో అధిక సాంద్రత పద్ధతిని ప్రోత్సహిస్తాం. గత ఏడాది అనావృష్టి పరిస్థితుల కారణంగా ఆశించిన దిగుబడులు రాకపోయినా ఎకరాకు 2 నుంచి 3 క్వింటాళ్ల దిగుబడి పెరిగింది. ఎంపిక చేసిన కొన్ని ప్రయివేటు కంపెనీల విత్తనాలనే వినియోగించాల్సి ఉంటుంది. 2024-25 సంవత్సరానికి సంబంధించి అధిక సాంద్రత పద్ధతిపై త్వరలోనే కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తాం. **– కళ్యాణి, పత్తి శాస్త్రవేత్త, నంద్యాల ఆర్ఏఆర్ఎస్**

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలి

– సత్రాల యజమానులతో ఈఓ పెద్దిరాజు



సత్రం యజమానులతో సమావేశమైన ఈఓ

శ్రీశైలం: ప్లాస్టిక్ నిషేధానికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఈఓ పెద్దిరాజు కోరారు. బుధవారం ఆయన దేవస్థానం పరిపాలన విభాగంలో సత్రాల యజమానులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ భక్తులు వాడిపడేసే ప్లాస్టిక్ వస్తువులను తిని జంతువులు మరణిస్తున్నాయన్నారు. ప్లాస్టిక్ బాటిల్స్, సంచులు, గ్లాసులు, ప్లేట్లు ఉపయోగించరాదని ఆదేశించారు. ప్లాస్టిక్ స్పూన్లు, ప్లాస్టిక్ ఫోర్క్‌లు, ప్లాస్టిక్ కప్పులు తదితరవాటిని పూర్తిగా నిషేధించామన్నారు. మట్టి, స్టీల్, రాగి, గాజు పాత్రలను వినియోగించాలన్నారు. ఈ ఆదేశాలను క్షేత్ర వ్యాప్తంగా ఉన్న అన్ని సత్రాల యజమానులు పాటించాలన్నారు. ఆయా సత్రాలకు వచ్చే భక్తులకు భోజనానికి అరటి ఆకులు, విస్తర్లు ఉపయోగించాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలన్నారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రామకృష్ణ, శానిటేషన్, రెవెన్యూ ఏఈఓ మల్లికార్జున రెడ్డి, పీఆర్వో శ్రీనివాసరావు, సెక్యూరిటీ విభాగం అధికారి అయ్యన్న, రెవెన్యూ సూపరింటెండెంట్లతో పాటు ఏపీఆర్వో శివారెడ్డి పాల్గొన్నారు.

ఆశాజనకంగా ఎండుమిర్చి ధర

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని మిర్చి యార్డులో ఎండుమిర్చి ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. బుధవారం సూపర్-10 రకం జనరల్ క్వింటాలు గరిష్ఠ ధర రూ.17,200, మధ్యస్థ ధర రూ.14,000, కనిష్ఠ ధర రూ.9,500 గా నమోదైంది. ఇదే రకం తాలుకాయ జనరల్ గరిష్ఠ ధర క్వింటాలు రూ.6,300, మధ్యస్థ ధర రూ.5,700, కనిష్ఠ ధర రూ.4,500 పలికినట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. అన్నదాతలు దళారులను నమ్మి మోసపోకుండా యార్డులోని ధ్రువీకృత వ్యాపారుల వద్ద సరుకు అమ్ముకొని మంచి ధరను పొందాలని సూచించారు.

మూడంచెల భద్రత... పకడ్బందీ పర్యవేక్షణ

- ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతర నిఘా
- కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాల మోహరింపు
- ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ
- భద్రత ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ కృష్ణకాంత్



ఆర్‌యూలో ఈవీఎం గది వద్ద కేంద్రబలగాలతో బందోబస్తు



స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగియడంతో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. కట్టుదిట్టమైన భద్రతతో పాటు నిరంతర పర్యవేక్షణ ఏర్పాటు చేశారు. జిల్లాకు సంబంధించి కర్నూలు రాయలసీమ యూనివర్సిటీలోని మూడు బ్లాకుల్లో 16 స్ట్రాంగ్ రూమ్‌ల్లో ఈవీఎంలను ఉంచి మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. మొదటి అంచెలో కేంద్ర సాయుధ బలగాలు, రెండో అంచెలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు, మూడో అంచెలో స్థానిక పోలీసులు 24 గంటల పాటు రక్షణగా ఉండేలా ఏర్పాటు చేశారు. వీరితో పాటు కంట్రోల్ యూనిట్లను నిరంతరం పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాలు అమర్చారు. భద్రత వ్యవస్థ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లను సందర్శించే అవకాశం సదరు రిట్నరింగ్ అధికారికి మాత్రమే ఉంటుంది.

స్ట్రాంగ్ రూం పరిసరాల్లో 144 సెక్షన్

ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూం పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంది. ఓటింగ్ యంత్రాలు భద్రపరిచేందుకు ప్రత్యేక సదుపాయాలు ఉన్న గదిని ఎంచుకుని డబుల్ లాక్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. సాధారణంగా స్ట్రాంగ్ రూంలకు ప్రవేశ ద్వారం ఒక్కటే ఉంటుంది. ఇతర మార్గాల ద్వారా చేరుకోవడానికి వీలు పడదు. పోలింగ్‌లో ఉపయోగించిన బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లు, పోస్టల్ బ్యాలెట్ పేపర్లతో పాటు విలువైన పత్రాలను భద్రంగా ఉంచేలా స్ట్రాంగ్ రూంలు ఏర్పాటు చేశారు.

కంట్రోల్ రూం ద్వారా నిఘా

ఈవీఎంల భద్రతకు అమర్చిన సీసీ కెమెరాలు అందించే దృశ్యాలను కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షిస్తారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు సైతం వాటిని పరిశీలించడానికి అవకాశం ఉంటుందని ఎన్నికల అధికారులు చెబుతున్నారు. సీసీ కెమెరాల నిర్వహణకు నిరంతర విద్యుత్ అవసరం. కరెంట్ కోతలు లేకుండా స్థానిక విద్యుత్ బోర్డు సహకరిస్తోంది. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అగ్నిమాపక యంత్రాలతో పాటు జనరేటర్ సౌకర్యం కూడా ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లకు ఉన్నత స్థాయి అధికారులను ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. అక్కడికి అనధికార వ్యక్తుల వాహనాలకు అనుమతి లేకుండా కట్టుదిట్టం చేశారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి ఏజెంట్లను ఓటర్ పెరిమీటర్ వరకు మాత్రమే అనుమతిస్తారు. ఆర్‌ఓలు ఇన్నర్ పెరిమీటర్ వరకు మాత్రమే వెళ్లాలి.

కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం

జూన్ 4న ఓట్ల లెక్కింపు జరిగేవరకు అత్యంత కట్టుదిట్టమైన భద్రతతో నిరంతర పోలీసు పహారా ఉండేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. స్ట్రాంగ్ రూంలో అమర్చిన సీసీ టీవీ కెమెరాలు కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసి వాటి దృశ్యాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. సీసీ టీవీ కవరేజ్‌తో సహా భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించడానికి గెజిటెడ్, పోలీసు అధికారులు 24 గంటలు డ్యూటీలో ఉండే విధంగా ప్రణాళిక రూపొందించారు. ఈవీఎం స్ట్రాంగ్ రూంల సెక్యూరిటీ మరియు కారిడార్ మొదలైన వాటి సీల్డ్ వేసిన డోర్లను కవర్ చేసే విధంగా సీసీ టీవీ కవరేజీ, వీడియోగ్రఫీ ఏర్పాటు చేశారు. అలాగే ప్రతి ఎంట్రీ, ఎగ్జిట్ ద్వారాల వద్ద విజిట్ చేసిన అధికారులు సంతకాలు చేసేందుకు లాక్ బుక్ (రిజిస్టర్లు) ఏర్పాటు చేశారు.

అపోహలు నమ్మొద్దు

ఈవీఎంల భద్రతపై అపోహలు, తప్పుడు ప్రచారాలు నమ్మొద్దని ఎస్పీ కృష్ణకాంత్ రాజకీయ పార్టీలకు సూచించారు. రాయలసీమ యూనివర్సిటీలో స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేసిన మూడంచెల భద్రతను బుధవారం ఎస్పీ తనిఖీ చేశారు. కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐలు నాగరాజు యాదవ్, శ్రీనివాసరెడ్డి, కర్నూలు అర్బన్, ట్రాఫిక్ సీఐలు శ్రీధర్, గౌతమితో పాటు ఆర్ఐలు ఎస్పీ వెంట ఉన్నారు. జిల్లాలో ఎవరైనా తప్పుడు ప్రచారాలు నమ్మి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే పోలీసు శాఖ తీవ్రంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటుందని ఎస్పీ హెచ్చరించారు. ఓట్ల లెక్కింపు ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, అసాంఘిక శక్తులు, రౌడీషీటర్లపై ప్రత్యేక పోలీసు నిఘా కొనసాగుతుందన్నారు.

ఏపీ ఈఏపీ సెట్‌కు సర్వం సిద్ధం

- నేటి నుంచి ఆన్‌లైన్‌లో పరీక్షలు
- ఉమ్మడి జిల్లాలో హాజరు కానున్న 27,480 మంది విద్యార్థులు
- నేడు, రేపు అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ
- 18 నుంచి ఇంజినీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు
- కర్నూలు జిల్లాలో 8, నంద్యాల జిల్లాలో 3 కేంద్రాల్లో నిర్వహణ
- ప్రతి రోజు రెండు సెషన్లలో పరీక్షలు

కర్నూలు సిటీ: ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విద్యలో ప్రవేశాలకు నిర్వహించే ఏపీ ఈఏపీ సెట్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నేటి నుంచి ప్రారంభమయ్యే ఈ పరీక్షలకు ఉమ్మడి జిల్లాలో మొత్తం 11 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది కూడా జేఎన్‌టీయూ కాకినాడ వారే ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. నేడు, రేపు అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్, 18 నుంచి 23వ తేదీ వరకు ఇంజినీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు జరుగనున్నాయి. మొత్తం 27,480 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ప్రతి రోజు రెండు సెషన్లలో ఈ పరీక్షలు జరుగుతాయి. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు రెండో సెషన్ నిర్వహించనున్నారు. పరీక్ష ప్రారంభానికి రెండు గంటల ముందుగానే విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవాలి. కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ పరీక్ష సమయానికి 5 నిమిషాల ముందుగానే నిలిపివేస్తారు.

ఉమ్మడి జిల్లాలో 11 కేంద్రాల్లో పరీక్షలు

ఏపీ ఈఏపీ సెట్‌కు ఉమ్మడి జిల్లాలో మొత్తం 11 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంజినీరింగ్‌కు 17,733, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీకి 9,747 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో కర్నూలులో ఏర్పాటు చేసిన 8 కేంద్రాల్లో ఇంజినీరింగ్ 12,249 మంది, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ 7,248 మంది, ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ రెండు పరీక్షలకు 109 మంది, నంద్యాలలోని 3 కేంద్రాల్లో ఇంజినీరింగ్ 5,484, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీకి 2,499 మంది, ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ రెండు పరీక్షలకు 9 మంది హాజరుకానున్నారు.

నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు


ఏపీ ఈఏపీ సెట్‌కు సంబంధించి జేఎన్‌టీయూ నిబంధనలను కఠినంగా అమలు చేయనుంది. విద్యార్థులు తమ వెంట ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురాకూడదని, అలాగే నిర్దేశించిన సమయానికి మించి నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించమని పేర్కొంది. బయోమెట్రిక్ హాజరు అమలు చేయనుండడంతో తొలి రోజున రెండు గంటలు ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని అధికారులు సూచించారు. విద్యార్థులు సులువుగా కేంద్రాలను గుర్తించేందుకు హాల్ టికెట్ వెనుక గూగుల్ మ్యాప్ ద్వారా బస్టాండ్ నుంచి పరీక్ష కేంద్రం ఎంత దూరం.. ఎలా వెళ్లాలి వివరాలు ఉంటాయి. విద్యార్థులు తమ వెంట బాల్ పాయింట్ పెన్ను, హాల్ టికెట్, ఎంసెట్ దరఖాస్తు, ఎస్సీ, ఎస్టీ అయితే కుల ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. రఫ్ పేపర్ కేంద్రంలోనే ఇస్తారు.

పరీక్ష కేంద్రాలివే:

ఈఏపీ సెట్ నిర్వహణకు కర్నూలు జిల్లాలో 8, నంద్యాల జిల్లాలో 3 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో కర్నూలుకు సంబంధించి ఐయాన్ డిజిటల్ జోన్ దూపాడు (కె.వి. సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ-లక్ష్మీపురం), ఐయాన్ డిజిటల్ జోన్(నంద్యాల చెక్ పోస్టు నుంచి నందికొట్కూరు వైపు వెళ్లితే కుడి వైపు ఉంటుంది-శాంతనగర్), జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ(బి.తాండ్రపాడు-నంద్యాల రోడ్డు), జి.పుల్లయ్య ఇంజినీరింగ్‌కాలేజీ-వెంకాయపల్లె(నందికొట్కూరు రోడ్డు), బృందావన్ ఇనిస్టిట్యూట్-పెద్దటేకూరు(డోన్ రోడ్డు), కె.వి సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ ఫర్ ఉమెన్(డోన్ రోడ్డు), ఆదోనిలోని బీమా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, ఎమ్మిగనూరులోని సెయింట్ జాన్స్ ఇంజినీంగ్ కాలేజీలలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే నంద్యాలలో శ్రీరామకృష్ణ డిగ్రీ, పీజీ కాలేజీ(ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పక్కన, శ్రీనివాసనగర్), శ్రీరామకృష్ణ డిగ్రీ, పీజీ కాలేజీ(అటానమస్ కాలేజీ-ఎస్‌బీఐ కాలనీ), ఎస్.వి.ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలలో కేంద్రాలు ఏర్పాటు చేశారు.

జగమేలు నాయక.. జగదానంద కారక

- వైభవంగా నారసింహుడి జయంతి బ్రహ్మోత్సవాలు



యోగా నృసింహ గరుడ వాహనంలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: అహోబిల దివ్యక్షేత్రంలో నృసింహస్వామి జయంతి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఎగువ అహోబిలంలో యోగా నృసింహ గారుడ వాహనముపై దేదీప్యమానంగా వెలుగొందిన లక్ష్మీనారసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి అమవార్లను దర్శించుకుని భక్తులు తరించారు. లక్ష్మీనరసింహ స్వామి జయంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజైన బుధవారం తెల్లవారు జామునే మూలమూర్తి జ్వాలనరసింహస్వామి, చెంచు లక్ష్మి అమ్మవార్లను మేలుకొలిపి, సుప్రభాత సేవ, నిత్యపూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవ మూర్తులను యాగశాలలో కొలువుంచి అర్చన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం జ్వాలనరసింహ స్వామి ఉభయ దేవేరులతో ప్రత్యేకాలంకరణ గావించిన యోగానంద గరుడ విమాన వాహనంలో కొలువై ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణలతో మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు.

క్లుప్తంగా

పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు



మద్దికెర : గుంతకల్ నుంచి పత్తికొండకు వెళుతున్న ఆర్టీసీ బస్సు బుధవారం మద్దికెర, బురుజుల గ్రామాల మధ్య అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. డ్రైవర్ చాకచక్యంతో బ్రేక్ వేసి నిలిపివేయడంతో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. మండలంలో 2రోజుల క్రితం భారీ వర్షాలు కురిశాయి. నల్లరేగడి పొలాలు కావడంతో రోడ్డుదిగి వెళుతుండగా బస్సు అదుపు తప్పింది. వెంటనే డ్రైవరు అప్రమత్తమై బ్రేకులు వేయడంతో ప్రమాదం తప్పింది.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం, నిందితుడిని చూపుతున్న సెబ్ పోలీసులు

ఆదోని రూరల్: అక్రమంగా కారులో తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని బుధవారం మండలంలోని విరుపాపురం గ్రామ సమీపంలో తంగరడోణ ఆర్చ్ వద్ద సెబ్ పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. ఆస్పరి మండలం డి.కోటకొండకు చెందిన పాపన్న, తురువగల్లు నరసన్న, మూసానపల్లికి చెందిన ధనుంజయులు 20 బాక్సుల (1920 టెట్రా ప్యాకెట్లు) మద్యాన్ని కారులో తీసుకొస్తున్నారు. ఈమేరకు సమాచారం అందడంతో తనిఖీ చేసి పట్టుకున్నట్లు సెబ్‌సీఐ విస్నీలత తెలిపారు. మద్యాన్ని, కారును సీజ్ చేసి సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. మద్యం రవాణా , నాటసారా తయారీ వెనుక ఎవరున్నా కఠిన చర్యలు తప్పవని ఈసందర్భంగా ఆమె హెచ్చరించారు.

చిగురు కోసం వెళ్లి మృత్యుఒడికి

మహానంది: చింత చెట్టెక్కి చిగురు కోస్తూ కింద పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మహానంది ఏజెన్సీ ఉద్యోగి యలగాని గోవిందు(48) బుధవారం ఆలయం వెనుక ట్యాంకు పక్కన ఉన్న చింతచెట్టు ఎక్కాడు. చిగురు కోస్తుండగా కొమ్మ విరగడంతో కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన గోవిందును ఆలయ ఏఈఓ ఓంకారం వేంకటేశ్వరుడు, అర్చకులు శరభయ్య, సిబ్బంది నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా కోలుకోలేక మృతి చెందాడు. గోవిందుకు భార్య భూలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

19న బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్ డోర్ స్టేడియంలో ఈనెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు అండర్-16 క్రికెట్ విభాగం బాలుర జట్టుకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కె. దేవేంద్రగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2008 సెప్టెంబర్ ఒకటో తేదీ తరువాత 2010 ఆగస్టు 31వ తేదీలోపు జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు నేరుగా ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఎంపికైన జట్టు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంటులో పాల్గొంటుందన్నారు.

జ్వర భద్రం!

దోమ పుట్టకూడదు...దోమ కుట్టకూడదనేది ప్రభుత్వ నినాదం. దోమ పుడితే అది మనుషులను కుడుతుంది. తద్వారా ప్రాణాంతకమైన మలేరియా, డెంగీ, చికున్ గున్యా వంటి వ్యాధులు వచ్చి మనిషి ప్రాణం మీదకు తెస్తాయి. ఈ ప్రమాదం నుంచి తప్పించుకోవాలంటే దోమల నివారణ చర్యలొక్కటే మార్గం. మన ఇళ్లు, పరిసరాల్లో అవి పెరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలి. నేడు జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

– కర్నూలు(హాస్పిటల్)

- వాతావరణంలో మార్పులతో దోమల పెరుగుదలకు ఆస్కారం
- జిల్లాలో ఏటా పెరుగుతున్న డెంగీ కేసులు
- ప్రతి సంవత్సరం 350 నుంచి 400 దాకా పాజిటివ్ కేసులు
- వేసవిలోనూ వెలుగు చూస్తున్న కేసులు
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన
- దోమల నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి



డ్రమ్ముల్లో నిల్వ చేసిన నీటిని పారవేస్తున్న వైద్యారోగ్యశాఖ సిబ్బంది

జిల్లాలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు ఆదోని, ఎమ్మిగనూరులో ఏరియా ఆసుపత్రులు, 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 5 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. వీటితో పాటు 400లకు పైగా నర్సింగ్‌హోమ్‌లు, క్లినిక్‌లు రోగులకు వైద్యసేవలు అందిస్తున్నాయి. గత నెలలో తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదు కాగా ఈ నెల మొదటి వారం తర్వాత వర్షాలు కురవడం ప్రారంభమైంది. ఈ మేరకు అక్కడక్కడా వర్షపు నీరు నిలబడటం సాధారణమైంది. ఈ పరిస్థితులు డెంగీ దోమలు పెరిగేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. ఇటీవల కాలంలో జ్వరం లక్షణాలతో ప్రైవేటు ఆసుపత్రికి రాగానే వైద్యులు ముందుగా ర్యాపిడ్ పరీక్ష చేయిస్తున్నారు. అందులో డెంగీ నిర్ధారణ అయితే వెంటనే రక్తకణాల పరీక్షలు చేస్తున్నారు. కణాల సంఖ్య తక్కువగా ఉంటే వెంటనే రక్తం, ప్లేట్‌లెట్లు తెచ్చుకోవాలని చెబుతున్నారు. ఇలాంటి సంఘటనలు నిత్యం ప్రతి ఆసుపత్రిలో కనిపిస్తోంది.

డెంగీ ఎలా సోకుతుందంటే...!

ఏడిస్ ఈజిప్టై అనే దోమకాటుతో డెంగీ సోకుతుంది. ఈ దోమ ఒంటిపై నల్లటి, తెల్లటి చారలు ఉంటాయి. అందుకే దీనిని పులిదోమ అని కూడా అంటారు. ఇది శుభ్రమైన, నిల్వ ఉన్న నీటిలో గుడ్లు పెడుతుంది. సూర్యోదయమైన రెండు గంటల వరకు, సూర్యోదయానికి రెండు గంటల ముందు మాత్రమే ఇది కుడుతుంది. ఇది రెండు వారాలు మాత్రమే జీవిస్తుంది. తన జీవితకాలంలో మూడుసార్లు మాత్రమే గుడ్లు పెడుతుంది. ప్రతిసారీ వంద గుడ్లు పెడుతుంది. ఈ దోమలు ఇంట్లో బట్టలు, పరుపులు, కర్టన్స్ వెనుక దాక్కుంటాయి.

డెంగీ వ్యాధి లక్షణాలు

తీవ్రమైన తలనొప్పి,కళ్లు, కండరాలు, కీళ్లనొప్పులు ఉంటాయి. ఒంటిపై ఎర్రటి దురదలు కనిపిస్తాయి. ముక్కు, చిగుళ్లల్లో రక్తం ప్రవిస్తుంది.

ప్రాథమిక చికిత్స ఇలా చేయాలి

- ప్రాథమికంగా బెడ్‌రెస్ట్ తీసుకోవాలి
- జ్వరం తీవ్రంగా ఉంటే తడిబట్టతో శరీరాన్ని తుడుస్తూ ఉండాలి.
- జ్వరం తగ్గేందుకు పారాసిటమాల్‌ను వైద్యుల సూచన మేరకు వాడుతూ ఉండాలి.
- ముఖ్యంగా శరీరం డీ హైడ్రేషన్‌కు గురికాకుండా ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగుతూ ఉండాలి.
- సాధ్యమైనంత త్వరగా వైద్యులను కలిసి మందులు వాడాలి.

ఆరేళ్లుగా జిల్లాలో డెంగీ కేసుల వివరాలు

సంవత్సరం	అనుమానిత కేసులు	పాజిటివ్ కేసులు
2019	373	63
2020	81	10
2021	1,169	170
2022	4,088	342
2023	2,484	409
2024(మే 12వరకు)	501	167

నివారణ చర్యలు

- డెంగీకారక ఏడిస్ ఈజిప్టై దోమ పగలు మాత్రమే కుడుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో శరీరాన్ని పూర్తిగా కవర్ చేసేలా దుస్తులు ధరించాలి. చిన్నపిల్లల విషయంలో ఇంకా జాగ్రత్తలు తీసుకోవాలి.
- దోమతెరలు, జాలీలు వాడాలి, దోమలను చంపే క్రీములు, స్ప్రేలు వాడాలి.
- రసాయనాలతో పొగబెట్టడం, ఇళ్లలో మందులు చల్లడం
- ఇంటిలో, ఇంటి ఆవరణలో నీళ్ల కుండీలు, ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో, బావులపై దోమలు గుడ్లు పెట్టకుండా మూతలు అమర్చాలి.
- పనికిరాని సీసాలు, డబ్బాలు, రబ్బరుటైర్లు, వాటర్ కూలర్లు వంటి పాత్రల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి. వాటిలో నీరు నిలిచిన వారం రోజుల్లో దోమలు పెరిగే అవకాశం ఉంది.

- అధిక శాతం ఒకటి, రెండువారాల్లో కోలుకుంటారు

ఈ దశలో ఆసుపత్రిలో చేర్చాలి

- తీవ్రమైన కడుపునొప్పి, రక్తవాంతులు అవుతుంటే, శరీరంపై ఎర్రటి దద్దుర్లు రావడం, ముక్కు, చిగుళ్లల్లో రక్తం ప్రవించడం, మలమూత్రాల్లో రక్తం పడటం, మత్తుగా ఉండటం, ఊపిరితీసుకోవడం కష్టంగా ఉన్న పరిస్థితుల్లో తప్పనిసరిగా ఆసుపత్రిలో చేర్చాలి.

దోమలు వ్యాపించకుండా చర్యలు



కర్నూలు మెడికల్ కాలేజీలోని మైక్రోబయాలజీ విభాగంలో ఎలీసా టెస్ట్ ద్వారా వచ్చిన డెంగీ నిర్ధారణ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటున్నాము. డెంగీ వ్యాధి నిర్ధారణ అయిన ప్రాంతాల్లో నివారణ చర్యలు చేపడుతున్నాము. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్లకు సమాచారం ఇచ్చి పాజిటివ్ కేసు వచ్చిన రోగి ఇంటి పక్కల 50 ఇళ్లల్లో పైరిత్రమ్ స్ప్రే చేస్తున్నాము. నీళ్లు నిలిచిన చోట యాంటి లార్వా చర్యలు తీసుకుంటున్నాము. దోమలు ఎక్కువగా ఉంటే మున్సిపల్, పంచాయతీ శాఖల సహకారంతో ఫాగింగ్ ఆపరేషన్ చేస్తున్నాము.

–నూకరాజు, జిల్లా మలేరియా అధికారి, కర్నూలు

డెంగీ పట్ల జాగ్రత్తగా ఉండాలి



సాధారణ మనిషిలో ప్లేట్‌లెట్లు 1.50 లక్షల నుంచి 4.50 లక్షల వరకు ఉంటాయి. డెంగీ సీజన్‌లో ఈ రక్తకణాల సంఖ్య 10వేలలోపు ఉంటే మాత్రమే జాగ్రత్తగా ఉండి, ఆసుపత్రిలో చేరి చికిత్స పొందాలి. జ్వరం తగ్గినా కూడా వారం తర్వాత అప్రమత్తంగా ఉండాలి. ఈ దశలో శరీరంలో వాపులు వస్తే మాత్రం ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. ఈ దశలో ఒంట్లో రక్తస్రావం మొదలై బీపీ తగ్గి ప్రాణాంతకమవుతుంది. కనుక ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకోవడమే ఉత్తమం.

–డాక్టర్ మీనిగ శ్రీనివాసులు, అసిస్టెంట్ ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్ విభాగం, జీజీహెచ్, కర్నూలు

- డెంగీ షాక్ సిండ్రోమ్, డెంగీ హెమరేజిక్ సిండ్రోమ్ దశలో ఆలస్యం చేయకుండా ఆసుపత్రిలో చేరి చికిత్స పొందాలి.

నిందితుల అరెస్టుపై టీడీపీ నేతల హంగామా

- ధర్నాకు తరలిరావాలని టీడీపీ కార్యాలయం నుంచి కార్యకర్తలకు వాట్సాప్ మెసేజ్‌లు
- పోలీసుల ముందస్తు చర్యలతో పారని టీడీపీ కుట్రలు



టీడీపీ అభ్యర్థి కోట్ల ఇంటి వద్ద పోలీసులు

డోన్: దళితులపై దాడి కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేస్తున్నారని తెలిసి టీడీపీ నేతలు హంగామా సృష్టించారు. ఒకానొక దశలో నిందితులకు కొమ్ము కాస్తూ ధర్నాకు తరలిరావాలని కార్యకర్తలకు మెసేజ్‌లు పంపారు. పోలీసు ముందస్తు చర్యలతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకపోవడంతో డోన్ పట్టణ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పూర్తి వివరాలు.. గత ఫిబ్రవరి 14న ప్యాపిలి మండలం గార్లదిన్నె గ్రామంలో శ్రీరాముల ప్రతిష్ట సందర్భంగా దైవ దర్శనానికి వచ్చిన గ్రామ దళితులపై అకారణంగా అగ్రవర్ణాలు దాడిచేసిన సంగతి తెలిసిందే. వారిని పోలీసులు అరెస్టు చేస్తున్నారని తెలుసుకున్న టీడీపీ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ బుధవారం పోలీసు అధికారులను బ్లాక్‌మెయిల్ చేస్తూ హంగామా సృష్టించేందుకు యత్నించారు. కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ సీమ సుధాకర్‌రెడ్డి, అతని కుమారుడు సీమ సుబ్బారెడ్డి, డోన్ వీఆర్‌ఓ మల్లారెడ్డి, టీడీపీ నాయకులు ఏకాంత రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మనోహర్ రెడ్డిలు గత ఫిబ్రవరి 13న లక్ష్మణరావు, నాగార్జున, శివ, నాగ చంద్రుడు, జక్కలయ్యలను కులం పేరుతో దూషించి మారణాయుధాలతో దాడిచేసి గాయపరిచారు. నిందితులను ఎన్నికల ముందు అరెస్ట్ చేస్తే రాజకీయ రంగు పులుముతారనే ఉద్దేశంతో పోలీసులు ఓపిక పట్టారు. పోలింగ్ ముగిసిన వెంటనే వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ విషయం తెలిసిన మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి బుధవారం ఉదయం డీఎస్పీ కార్యాలయం ముట్టడికి తరలిరావాలని టీడీపీ కార్యాలయం నుంచి కార్యకర్తలకు వాట్సాప్ మెసేజ్‌లు పంపారు. దీంతో డీఎస్పీ కార్యాలయం వద్దకు పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు, మరోవైపు పోలీసులు చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. సుజాతమ్మ ఇంటి వద్దకు పోలీసులు చేరుకొని ఆమెను గంటపాటు గృహనిర్బంధంలో ఉంచారు. అనంతరం పాత కేసులో అరెస్టు చేశామని, ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు, ముట్టడి కార్యక్రమాలు లాంటివి చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడంతో ఆమె మిన్నకుండిపోయారు.

దుష్ప్రచారం.. కోట్ల దంపతుల అజ్ఞానానికి నిదర్శనం

- మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి



డోన్: కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ సీమ సుధాకర్ రెడ్డి అరెస్టు విషయంలో టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుజాతమ్మ దంపతులు చేస్తున్న దుష్ప్రచారం వారి అజ్ఞానానికి నిదర్శనమని రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి బుగ్గన రాజేంద్రనాథ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓటమి భయంతో వారు ఏం చేస్తున్నారో వారికే తెలియడంలేదని, వారి కళ్లు తెరిపించేందుకే ప్రెస్ నోట్ రిలీజ్ చేయాల్సి వచ్చిందని అన్నారు. ప్యాపిలి మండలం గార్లదిన్నె గ్రామంలో ఫిబ్రవరి 14న దళితులపై జరిగిన దాడి కేసులో సీమ సుధాకర్ రెడ్డితో పాటు మరికొందరిపై కేసు నమోదు అయ్యిందన్నారు. అప్పుడు కోట్ల కుటుంబీకులు డోన్‌కు సంబంధం లేకుండా ఆలూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ కేసులో ఫిర్యాదుదారులైన దళితులు టీడీపీ మద్దతుదారులన్న విషయం తెలుసుకోకపోవడం కూడా కోట్ల దంపతుల అవివేకానికి నిదర్శనమన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ నిందితులను అరెస్ట్ చేయాలని నోటీసు జారీ చేసినా ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని డీఎస్పీ అరెస్ట్ చేయలేదన్నారు. టీడీపీకి చెందిన దళితులు తమపై దాడి జరిగిందని మొరపెట్టుకుంటే వారికి అండగా ఉండకుండా దాడి చేసిన అగ్రవర్ణాలకు వత్తాసు పలకడం సిగ్గుచేటన్నారు. పీఎస్ బాబు గతంలో ఏఎస్పీగా ఉన్న సమయంలో వ్యభిచారం చేస్తూ పట్టుబడి సస్పెండ్ అయిన విషయం వాస్తవం కాదా అని కోట్ల దంపతులను మంత్రి ప్రశ్నించారు. ఈ జిల్లాతో ఎలాంటి సంబంధం లేని పీఎస్ బాబుని ఇండిపెండెంట్‌గా పోటీ చేయించి, తన వాహనాన్ని వెంటాడే డ్యూటీ అప్పగించి తప్పుడు కేసులు పెట్టించేందుకు ఉపయోగించడం ఎంతవరకు సమంజమన్నారు. తప్పుడు సలహాలు, సూచనలు మాని రాజకాయ పరిజ్ఞానం, పరిపక్వతతో మాట్లాడాలని కోట్ల దంపతులకు మంత్రి బుగ్గన హితవు పలికారు

ఆది నుంచీ వివాదాస్పదుడే!

- డోన్ వీఆర్ఓ మల్లారెడ్డి తీరుపై సర్వత్రా విమర్శ



పార్టీ జెండా ఆవిష్కరణలో మల్లారెడ్డి

డోన్: ప్యాపిలి మండలం గార్లదిన్నె గ్రామానికి చెందిన మల్లారెడ్డి మొదటి నుంచీ వివాదాస్పదుడిగానే పేరుపొందాడు. వీఆర్ఓ ఉద్యోగం వచ్చినప్పటి నుంచి టీడీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నా అధికారులు అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పలు పార్టీ కార్యక్రమాల్లో అన్నీ తానై వ్యవహరించాడు. బాధ్యత గల ప్రభుత్వ ఉద్యోగి ఒక పార్టీకి కొమ్ముకాయడం ఏమిటని గతంలో ప్రజలు, ప్రజాసంఘాలు విమర్శించినా అతనిని ఎవరూ ఏమీ చేయలేకపోయారు. ప్రజాధనాన్ని జీతంగా తీసుకుంటూ ఒక పార్టీకి కొమ్ముకాయడం ఏమిటని, ఇలాంటి వారిని ఉద్యోగం నుంచి తొలగించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

దొంగ బంగారు కొనుగోలుకు వచ్చి..

- సెబ్ వలకు చిక్కిన వ్యాపారి
- పట్టుబడిన నగదు ట్రెజరీలో జమ



సెబ్ అధికారులకు పట్టుబడిన నగదు (ఫైల్)

కర్నూలు: దొంగ బంగారం కొనుగోలు చేసేందుకు కర్నూలుకు వస్తూ తెలంగాణకు చెందిన ఓ బంగారు వ్యాపారి సెబ్ తనిఖీల్లో పట్టుబడ్డాడు. నగర శివారులోని పంచలింగాల అంతర్‌రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టు వద్ద సెబ్ ఎస్‌ఐ పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. తెలంగాణ వైపు నుంచి వస్తున్న ఓ కారును ఆపి తనిఖీ చేయగా అందులో రూ.35.70 లక్షలు నగదు బయటపడింది. కారు లో ఉన్నవ్యక్తి వెంకటేష్ ను అదుపులోకి తీసుకుని విచారించగా వనపర్తిలో రాఘవేంద్ర జ్యువెలర్స్ పేరుతో బంగారు దుకాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కర్నూలు పాతబస్తీకి చెందిన జాకీర్ అనే వ్యక్తి దగ్గర దొంగ బంగారు కొనుగోలు చేసేందుకు వచ్చినట్లు అధికారుల విచారణలో తెలిపాడు. పట్టుబడిన డబ్బుకు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో జిల్లా ట్రెజరీ ఆఫీసులో జమ చేశారు. ఐదు రోజుల్లోగా ఎలాంటి ఆధారాలు చూపకపోతే ఆ సొమ్ము ప్రభుత్వ ఖజానాకు జమ అవుతుంది.

బరితెగించిన టీడీపీ నాయకులు

- చుంచు ఎర్రగుడిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై హత్యాయత్నం
- కళ్లల్లో కారం చల్లి, రాళ్లు, కట్టెలతో దాడి
- జేసీబీలతో నూతన కొట్టాలు కూల్చివేత
- ఐదుగురికి గాయాలు
- హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు



కొట్టాలను జేసీబీతో నేలమట్టం చేసిన దృశ్యం



గాయపడిన జనార్దన్, రామాంజినమ్మ తదితరులు

కృష్ణగిరి: టీడీపీ నాయకులు బరితెగించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, మద్దతుదారులపై దాడులకు తెగబడుతూ ప్రశాంత గ్రామాల్లో అలజడులు సృష్టిస్తున్నారు. బుధవారం మండల పరిధిలోని చుంచుఎర్రగుడి గ్రామంలో గుడిసెలు కూల్చివేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే.. చుంచుఎర్రగుడికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఏడుగురు గ్రామానికి అనుకుని ఉన్న 338 సర్వే నెంబర్ స్థలాన్ని రిజిస్టర్ చేయించుకుని అందులో కొట్టాలను వేసుకునేందుకు వెళ్లగా గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ప్రకాష్‌గౌడ్ ఆ స్థలం తనదని అడ్డుకున్నాడు. ఈ విషయంలో ఇరువురు కోర్టుకు వెళ్లగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో నెల రోజుల నుంచి తలారి రామాంజినమ్మ, సులోచనమ్మ, ఉసేన్‌బీ, శిరోళ్ల రామలింగడు, మహేశ్వరి తదితరులు స్థలంలో బండలు పాతి గుడిసెలు వేసుకున్నారు. దీనిని జీర్ణించుకోలేని టీడీపీ నాయకుడు ప్రకాష్‌గౌడ్ బుధవారం ఏకంగా డోన్ నుంచి దాదాపుగా 40 మందిని పిలిపించి వారికి మద్యం తాపించి దాడులకు తెగబడ్డాడు. రెండు జేసీబీలతో ముందుగా గుడిసెలను నేలమట్టం చేయించాడు. అడ్డుకునేందుకు వెళ్లిన బాధితుల కళ్లలో కారం చల్లి కట్టెలు, రాళ్లతో దాడులు చేయించాడు. ఈ ఘటనలో తలారి శ్రీను, వెంకటస్వామి, జనార్దన్, సులోచనమ్మ, రామాంజినమ్మ గాయపడ్డారు. వీరిని స్థానికులు చికిత్స నిమిత్తం 108లో వెల్దుర్తి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన అక్కడి వైద్యులు తీవ్ర గాయాలైన తలారి శ్రీను, రామాంజినమ్మ, జనార్దన్‌ను మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి, వెల్దుర్తి సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి అదుపులోకి తెచ్చారు. అయితే, తప్పు చేసిన వారిని కాదని అక్కడికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్ష్మీకాంతరెడ్డి, కార్యకర్తలనే దుర్భాషలాడటం చూస్తే పోలీసుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సమస్యను పోలీసులు సీరియస్‌గా తీసుకోకపోవడంతోనే ఈ ఘటన జరిగినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

హత్యాయత్నం కేసు నమోదు

సంఘటనా స్థలంలో డోన్ నుంచి వచ్చిన వారు కనిపించడంతో పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. అయితే, వారిని కేసులో నుంచి తప్పించేందుకు ఎఫ్ఐఆర్‌లో పేర్లు పెట్టలేదు. ఫిర్యాదులో వారి పేర్లు తొలగించాలని బాధితులపై ఒత్తిడి సైతం తెచ్చినట్లు సమాచారం. బాధితుడు బాల వెంకటరాముడు ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఈడిగ జయప్రకాష్‌నారాయణ్ (వురఫ్) ప్రకాష్‌గౌడ్, అతని భార్య ఉదయజ్యోతి, కుమారుడు సన్నగౌడ్, తిలక్‌కుమార్‌గౌడ్, లోకేష్‌గౌడ్, శేఖర్‌తోపాటు మరి కొందరిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

టీడీపీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ కేసు

కొలిమిగుండ్ల: పెట్నికోటలో పోలింగ్ బూత్ వద్ద జరిగిన దాడి కేసులో 29 మంది టీడీపీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు సీఐ గోపీనాథ్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈనెల 13న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా గ్రామంలోని 14వ బూత్ వద్ద ఓటు వేసేందుకు నరిగి మద్దిలేటి, వెంకటరాముడు, అలివేలమ్మ, తుడుము పెద్దయ్య, గుర్రం రామచంద్రుడుతో పాటు కొంత మంది క్యూలైన్‌లో నిల్చున్నారు. అదే సమయంలో టీడీపీ నాయకులు అక్కడికి చేరుకొని టీడీపీకి ఓటు వేయాలని బెదిరింపులకు దిగారు. తమకు నచ్చిన వారికి ఓటు వేసుకుంటామని సమాధానం ఇవ్వడంతో ఆగ్రహానికి లోనైన టీడీపీ నాయకులు కులం పేరుతో దూషిస్తూ తమకే ఎదురు చెబుతారా అంటూ రాళ్లతో దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు టీడీపీ నాయకులు ఐవీ ఫక్కీరారెడ్డి, మూలె రామేశ్వరరెడ్డి, నంద్యాల రామేశ్వరరెడ్డి, గొంగటి హుశేన్‌రెడ్డి, గొంగటి నారాయణరెడ్డి, యాతం సత్యనారాయణరెడ్డి, కొప్పుల వెంకట శివారెడ్డి, నామాల నాగపుల్లయ్య, మెట్ట నాగార్జున, దూదేకుల హాజీవలి, చాకలి శివాంజనేయులు, బూరుగల మౌలాలి, కదిరి శివకేశవరెడ్డితో పాటు మొత్తం 29 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు సీఐ చెప్పారు.

కోట్ల వెంట అసాంఘిక శక్తులు

- గార్లదిన్నె దళితులు



అంబేడ్కర్ విగ్రహం వద్ద శ్రీరాములుతో గార్లదిన్నె దళితులు

డోన్: టీడీపీ డోన్ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి దంపతులు అసాంఘిక శక్తులను వెంటబెట్టుకుని తిరుగుతున్నారని ప్యాపిలి మండలం గార్లదిన్నె గ్రామానికి చెందిన దళితులు లక్ష్మణరావు, జిక్కిలేరు, శివనాగచంద్రుడు ఆరోపించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములుతో కలిసి వారు విలేకరులతో మాట్లాడారు. గత ఫిబ్రవరి 14న గ్రామంలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా దైవ దర్శనానికి వెళ్లిన తమను కులం పేరుతో దూషించి మారణాయుధాలతో దాడిచేసి వారికి వంత పాడటం కోట్ల దంపతులకు తగదన్నారు. టీడీపీ చెందిన తమపైనే దాడి జరిగితే స్పందించని కోట్ల కుటుంబీకులు మిగిలిన దళితులపై దాడి జరిగితే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కోట్ల దంపతులకు దళితులపై నిజంగా ప్రేమ ఉంటే నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలన్నారు. మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు మాట్లాడుతూ కోట్ల సుజాతమ్మ ఆలోచనలు పెత్తందారులకు వంత పాడేవిధంగా ఉన్నాయన్నారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిపై రిటైర్డ్ ఏఎస్పీ పీఎస్ బాబుతో తప్పుడు కేసు పెట్టించిన కోట్ల దంపతుల కళ్లకు గార్లదిన్నె దళితులు కనపడలేదా అని ప్రశ్నించారు. కోట్ల దంపతులకు దమ్ము, ధైర్యముంటే గార్లదిన్నె దళితులపై జరిగిన దాడిని ఖండించాలని శ్రీరాములు సవాల్ విసిరారు.